ప్రజావాణికి పండుగ ఎఫెక్ట్

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఒక ఫిర్యాదు వచ్చింది. కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన పాపయ్యయాదవ్ నగర్‌లో రోడ్ నంబర్–2, రోడ్ నంబర్–7 స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని జేబీ నారాయణ యాదవ్ ఫిర్యాదు చేయగా, సంబంధిత శాఖ అధికారులు వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ఒక ఫిర్యాదు వచ్చింది. దసరా పండుగకు ప్రజలు సొంత ఊర్లకు వెళ్లడంతో ప్రజావాణి బోసిపోయింది.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్



చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. షాపూర్‌నగర్‌లోని కార్యాలయంలో వేముల సత్యనారాయణ, కుర్ర మణిశేఖర్ గౌడ్, మాధగుంట లక్ష్మికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం మంజూరు కాగా సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజానర్సింహ కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు శివ కుమార్ గౌడ్, కూన రాఘవేంద్రగౌడ్, కృష్ణ యాదవ్, జిమ్ వేణు, మహేందర్ రెడ్డి, మక్బూల్, మణికంఠ తదితరులు ఉన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



ఉప కమిషనర్ మల్లారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

సుభాష్‌నగర్: రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని అడ్డుకోవాలని కోరుతూ గాజులరామారం డివిజన్ మహదేవపురం సొసైటీ సభ్యులు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కాలనీలోని ప్లాట్ నంబర్ జె–101, 102 లకు సంబంధించి పశ్చిమం వైపు ఉన్న 30 అడుగుల రోడ్డును ఆక్రమించి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు రాత్రికి రాత్రే గది నిర్మించారని దీంతో రాకపోకలకు ఆటంకం కలుగనుందని, వెంటనే తగు చర్యలు చేపట్టాలని సంఘం అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి కోరారు. దీనిపై ఉప కమిషనర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్‌లోని శ్రీ కమల ప్రసన్న వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత కమిటీ కాలపరిమితి ఫిబ్రవరిలో ముగియగా గత నెల అడ్‌హక్ కమిటీ వేసి ఆగస్టు 18 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభించారు. ఇతర నామినేషన్లు రాకపోవడంతో 28న ఆదివారం సాయంత్రం 7 గంటలకు సంక్షేమ సంఘం కమిటీ హాల్‌లో పెద్దల సమక్షంలో ఎన్నికల అధికారి ఎం. జనార్దన్ సంక్షేమ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా ఏ. శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా ఎస్. రమణారావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.బి. చలమయ్య, కోశాధికారిగా జి. వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎం. కనకచంద్రం, కార్యనిర్వాహణ కార్యదర్శిగా ఎం. శేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి హాజరైన కాలనీవాసులు వారిని శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీవాసులు రూ. 60 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం, కాలనీవాసులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమున్న చోట్ల దశలవారీగా పనులు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

నియోజకవర్గవ్యాప్తంగా సోమవారం సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మహిళలు, యువతులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి కూడళ్ల వద్ద పెట్టి ఆడిపాడారు. అనంతరం సమీప కొలనులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు. – కుత్బుల్లాపూర్



బతుకమ్మతో చిన్నారి



రంగారెడ్డినగర్‌లో..



బతుకమ్మతో యువతి



దూలపల్లి అయ్యప్పకాలనీలో..



బతుకమ్మలతో ఉపాధ్యక్షుడు ఆచార్య వి.నిత్యానందరావు



వేడుకల్లో విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు



బతుకమ్మలతో మహిళలు



ఆదర్శనగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో..



వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గండిమైసమ్మలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



మల్లంపేట్ ప్రణీత్ ప్రణవ్‌లో..



జీడిమెట్ల ఉడ్స్ ఎన్‌క్లేవ్‌లో..



దూలపల్లిలో బతుకమ్మతో మహిళలు

బాధితులకు న్యాయం చేయాలని వినతి



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని సర్వే నంబర్–307 లోని ప్రభుత్వ భూమిలో హైడ్రా అధికారులు కూల్చేసిన ఇళ్ల బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈమేరకు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు ఏసురత్నం మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కబ్జా అయ్యాయని కొందరు నిరుపేదలు తక్కువ ధరకు స్థలాలు వస్తున్నాయని కొనుగోలు చేశారన్నారు. ఇళ్ల నిర్మాణ సమయంలో అడ్డుకోకుండా ప్రస్తుతం హైడ్రా అధికారులు కూలివేతలు చేపట్టడంతో వారంతా నష్టపోయారన్నారు. ప్రభుత్వమే బాధితులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూం ఇళ్లను అందించాలని విన్నవించారు. సీపీఐ నాయకులు ఉమామహేశ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, ఇమామ్, వంశీ ఉన్నారు.

ప్రభుత్వ భూముల్లోని అక్రమ నిర్మాణాలను తొలగించండి

తహసీల్దార్లను ఆదేశించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ భూములను కాపాడే దిశగా చర్యలు తీసుకోవడంతో పాటు అక్రమ నిర్మాణాలను తొలగించాలని మండలాల తహసీల్దార్లను మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. తహసీల్దార్ లాగిన్ ఐడిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరిగతిన పూర్తి చేయాలని సూచించారు. కలెక్టరేట్ వీసీ హాల్‌లో డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి రెవెన్యూ పెండింగ్ అంశాలపై సోమవారం ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో భూభారతి, ఆర్‌ఓఆర్, టీజీపాస్ దరఖాస్తుల పెండింగ్ క్లియర్ చేయాలని తహసీల్దార్లను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్‌కు గల కారణాలను తహసీల్దార్లను



ఆయన అడిగి తెలుసుకోవడంతో పాటు తగిన సూచనలు జారీ చేశారు. కుల, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చొరవ తీసుకొని పూర్తి చేయాలన్నారు. సమావేశంలో లా ఆఫీసర్ చంద్రావతి, కీసర, మల్కాజిగిరి ఆర్డీవోలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాష్, జిల్లాలోని వివిధ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పండగ వేళ.. కలెక్టరేట్‌లో 58 ఫిర్యాదులు

రెవెన్యూ శాఖపై 12 ఫిర్యాదులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణిలో సోమవారం 58 ఫిర్యాదులు రాగా, ఇందులో కలెక్టరేట్‌లోని డి–సెక్షన్‌కు సంబంధించి 16, ఇ–సెక్షన్‌లోని సమస్యలపై రెండు ఫిర్యాదులు అందాయి. అలాగే, రెవెన్యూ శాఖకు సంబంధించి కీసర ఆర్డీఓకు 4, మల్కాజిగిరి ఆర్డీఓకు 3, మల్కాజిగిరి తహసీల్దార్‌కు 3 ఫిర్యాదులను అందజేశారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, డీఎంహెచ్‌ఓ, డీసీఓ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు కలెక్టరేట్ ప్రజావాణిలో వచ్చాయి. సద్దుల బతుకమ్మ, దసరా పండుగ వేళ కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. జిల్లా అదనపు కలెక్టర్లకు ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్ ప్రజావాణిలో డీఆర్‌ఓ హరిప్రియ, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డితో కలిసి ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ) రాధిక గుప్తా స్వీకరించారు. మొత్తం 58 ఫిర్యాదులు అందినట్లు ఆమె పేర్కొన్నారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ వివిధ శాఖలలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. అర్జీలను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్‌లో పెట్టకూడదని హెచ్చరించారు.

నిరంతరం స్వచ్ఛభారత్‌ను కొనసాగించాలి

రాయదుర్గం: స్వచ్ఛభారత్ ఉద్యమం నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు అభిప్రాయపడ్డారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా క్యాంపస్‌లో సోమవారం 'స్వచ్ఛతా హీ సేవా–2025' కార్యక్రమాన్ని నిర్వహించారు. క్యాంపస్‌లో అధికారులు, ఉద్యోగులు, ఫ్యాకల్టీ, విద్యార్థులు శుభ్రం చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒక్కసారి కాకుండా ప్రతి మాసం ఒకరోజు మన పరిసరాలను మనమే స్వచ్ఛందంగా శుభ్రం చేసుకోవాలన్నారు. ఎస్కీ' క్యాంపస్‌లో ఇక నుంచి ప్రతి నెలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన ప్రకటించారు. ఎస్కీ సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ ఆర్ వెంకట్‌రెడ్డి, కాలేజ్ చీఫ్ లక్ష్మీకాంతారావు, డాక్టర్ పి రాజారావు, ప్రొ.వెంకట్‌రెడ్డి, కె.జే.అమర్‌నాథ్ డాక్టర్ చంద్రకళ, డాక్టర్ యూఎస్ జ్యోతి, సయ్యద్ అజ్గర్, అనితా అగర్వాల్, డాక్టర్ విద్యాసాగర్, రామకిషోర్, పి.సాయికిషోర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అశోక్ పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు తరలిన మహిళలు



దుండిగల్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన బతుకమ్మ వేడుకలకు దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆధ్వర్యంలో మెప్మా, మహిళా రిసోర్స్ పర్సన్స్, పొదుపు సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. గండిమైసమ్మ చౌరస్తా నుంచి మొత్తం 3 బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు.

ఎఫ్‌డీడీఐలో రక్తదాన శిబిరం

రాయదుర్గం: రక్తదానం చేయడానికి విద్యార్థులు, యు వత ముందుకురావా లని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ తేజ్‌లోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ క్యాంపస్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరాన్ని ఎఫ్‌డీడీఐ సోషల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. హిమాయత్‌నగర్‌లోని పివి నర్సింహారావు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్యాకల్టీ డాక్టర్ రాంబాబు ముప్పిడి, అమిత్‌పురి, హుస్సేన్, జ్యోతిప్రియ, ఇళయరాజ, విద్యార్థులు రోషిత, లోకేష్ శ్రీరామ్, సంతోష్, జీవా, పివి చారిటబుల్‌ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడోత్సవాల్లో చెస్, క్యారమ్స్, మ్యూజికల్ చైర్, లెమన్ – స్పూన్, రన్నింగ్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించగా, ఇందులో 100 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా టీజీఓ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్మోహన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరీ, జిల్లా



స్పోర్ట్స్ అధికారి దామోదర్‌రెడ్డి, లీడ్ బంక్ మేనేజర్ శివకుమార్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

ప్రజావాణి.. 6 ఫిర్యాదులు

చందానగర్ : చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ శశిరేఖ సర్కిల్ పరిధిలో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలపై 6 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో టౌన్ ప్లానింగ్ 2, ఇంజనీరింగ్ 2, రెవెన్యూ 1, ఎలక్ట్రికల్ 1 సెక్షన్‌లకు సంబంధించినవి వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మణికరణ్, ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవికుమార్, ఇంజనీరింగ్ డీఈ దుర్గప్రసాద్, ఎంటమాలజీ, యూబీడీ అధికారులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్ సంగమేష్

మియాపూర్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడు వదిలి వెళ్లిన బ్యాగును అందజేసి కండక్టర్ నిజాయితీని చాటుకున్నాడు. డిపో అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... యూసుఫ్‌గూడకు చెందిన శ్రీశైలం లక్ష్మీ హుండాయ్ షోరూమ్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీ ఎస్‌ఆర్ నగర్ నుండి హిమాయత్‌నగర్ వైపు ఆర్టీసీ మియాపూర్ –2 డిపో పరిధిలోని బస్సులో ప్రయాణించాడు. ఈ క్రమంలో తన బ్యాగును బస్సులో మర్చిపోయాడు. అనంతరం కండక్టర్ సంగమేష్ డిపో అధికారులకు సమాచారం ఇచ్చి అందజేశారు. ఆ బ్యాగును చూడగా అందులో రూ.8వేలు విలువచేసే మనీ స్వైపింగ్ మిషన్‌ను గుర్తించారు. రసీదు ఆదారంగా ప్రయాణికులు శ్రీశైలంకు విషయం తెలిపారు.



కండక్టర్ సంగమేష్‌ను సత్కరిస్తున్న డిపో అధికారులు

సోమవారం డిపో మేనేజర్ వెంకటేశం, డిపో ఉద్యోగుల సమక్షంలో ప్రయాణికుడు శ్రీశైలంకు బ్యాగు అందజేశారు. కండక్టర్ సంగమేష్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు.

తల్లీ..కరుణించమ్మా..

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు

దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారు సరస్వతీ దేవీగా దర్శనమివ్వగా, భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అదేవిధంగా పలువురు నాయకులు మండపాలు, ఆలయాలకు విచ్చేశారు. – రంగారెడ్డినగర్



సరస్వతీదేవి అలంకరణలో పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ..



శ్రీజ్ఞాన సరస్వతీదేవిగా గాజులరామారం చిత్తారమ్మ..



దూలపల్లి సరస్వతీదేవి అవతారంలో అమ్మవారు..



హెచ్‌ఎంటీ సొసైటీలో ..



సూరారంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్



నిజాంపేట్‌లో మాజీ మేయర్ కొలన్ నీలారెడ్డి